శ్రీ

శ్రీమతే రామానుజాయనమః

# గద్యత్రయ ప్రబంధము

(ఆంధ్రీకరణము)


రచన

**కె. రామానుజ భట్టర్**

హన్మకొండ



*ప్రచురణ*

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2016**

# GADYATRAYA PRABANDHAM

**(ANDRIKARANAM)**

*By*

**K. Ramanuja Bhattar**

T.T.D. Religious Publications Series No. 1191

© All Rights Reserved

*First Edition : 2016*

*Copies :* 2000

*Published by*

**Dr.D.SAMBASIVA RAO,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507

Office of the Editor-in-Chief
T.T.D, Tirupati.

*Printed at :*

**Tirumala Tirupati Devasthanams Press,**
Tirupati - 517 507

# ముందుమాట

భారతావనిలో సనాతన సంప్రదాయాన్ని సుస్థిరంచేసి ప్రాచుర్యం కావించటంలో త్రిమతాచార్యులస్థానం సముచితమైనది, సమున్నతమైనది. అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత మతస్థాపనాచార్యులు శంకర, రామానుజ, మధ్వాచార్యులు. శంకరభగవత్పాదులవారిది బ్రహ్మ సంప్రదాయం, భగవద్రామానుజులవారిది శ్రీసంప్రదాయం, మధ్వాచార్యులవారిది ఏకాయన సంప్రదాయం. ఈ మూడింటిలోనూ 'శరణాగతి' సంప్రదాయం ఉంది.

శ్రీరామానుజులవారి విద్వత్తు, భక్తి, ప్రపత్తి త్రివేణీ సంగమంలా శ్రీభాష్య, గీతాభాష్య, గద్యత్రయాదిక రచనలలో దర్శనమిస్తుంది. రామానుజ'వాణి'కి గద్యత్రయం రత్నకిరీటం. గద్యత్రయంలోని అక్షరాక్షరాలలో రహస్యవేదాంతప్రస్థానం గర్భితం. ఇది వేదాంత రహస్య విషయాలు కలిగిన మూడు ప్రబంధాల సంపుటి. రామానుజులవారు భక్తిరస ప్రవాహరూపంగా గద్యత్రయాన్ని ఆశువుగా చెప్పారని పూర్వాచార్యుల కథనం. గద్యవాఙ్మయంలోని ప్రార్థనాగద్యలలో గద్యత్రయంలోని శ్రీశరణాగతిగద్య, శ్రీరంగగద్య, శ్రీవైకుంఠగద్య అనర్ఘ రత్నాలు. గద్యత్రయాన్ని భావయుక్తంగా అర్థంచేసుకుంటే మనోవికారాలు తొలగి భగవదనుగ్రహప్రాప్తికి ప్రవేశార్హత (ఎంట్రెన్స్ క్వాలిఫికేషన్) లాంటిది.

గద్యత్రయంలోని శ్రీశరణాగతిగద్యను ప్రాతఃకాలపూజా సమయాన, శ్రీరంగగద్యను మాధ్యాహ్నిక పూజాసమయాన, శ్రీవైకుంఠగద్యమును రాత్రి శయన సమయాన పఠించాలని పురాతన సంప్రదాయం.

ఆరాధనలో స్వామివారి గుణసౌందర్యాలను దాసులైన భక్తులకు ఎలా ఆత్మీయార్పణచేయాలో తెలిపేది 'శరణాగతిగద్యం'. ఈ గద్యం ఒకరకంగా ద్వయమంత్రానికి వ్యాఖ్యానరూపంగా ఉందని పెద్దలమాట. శ్రీదేవిని మొదట ఆశ్రయించి ఆ తర్వాత శ్రీమన్నారాయణుని ఆశ్రయించాలనీ, ఆమె

పురుషకారం (రెకమెండేషన్) వల్ల శీఘ్రంగా భగవదనుగ్రహం కలుగుతుందని పూర్వాచార్యుల మాట.

శ్రీరంగనాథులవారి దివ్యసౌందర్యాన్ని, కల్యాణగుణగణాలనూ సాక్షాత్కరింపజేసి, ఆవిష్కరించేది 'శ్రీరంగగద్యం'.

శ్రీవైకుంఠ దివ్యలోకం అచటి వైకుంఠనాథుని వైభవం సంపూర్ణంగా ఎరిగినవారు ఆదిశేషులవారు. ఆదిశేషాంశసంభవులు రామానుజులవారు కావడం గమనార్హం. శ్రీవైకుంఠ దర్శనంవల్ల కలిగే దివ్యానుభూతి 'శ్రీవైకుంఠగద్య' పఠనం వల్ల కలుగుతుంది. వైకుంఠగద్యాన్ని విన్నా చదివినా వైకుంఠాన్ని దర్శిస్తూ చేసిన గచ్ఛద్వ్యాఖ్యగా (రన్నింగ్ కామెంటరీగా) ఉంటుంది. ఇదొక పరమదివ్యయాత్రాదర్శిని (స్పిరిచువల్ టూరిస్ట్ గైడ్) అనిపిస్తుంది.

గద్యత్రయప్రబంధం దీర్ఘసమాసభూయిష్ఠంగా, గంభీరార్థ పదాలతో ఉంటుంది. అలాంటి ప్రబంధత్రయాన్ని శ్రీమాన్ కె.రామానుజభట్టర్‌వారు సులభసుందరమైన సంప్రదాయ పద్ధతిలో వివరణాత్మకంగా ఆంధ్రీకరించారు.

సంప్రదాయ గ్రంథాలను భావయుక్తంగా ప్రచురించి సకల జనాలలో ధార్మికభావాలను పారమార్థికరక్తిని, భక్తిని కలుగజేసే ప్రయత్నంలో – శ్రీస్వామివారి అనుగ్రహశక్తితో అనేక ధార్మిక గ్రంథాలను ప్రచురిస్తున్నాము. అందులో భాగంగా భక్తజనులకు ఉపయోగపడే 'గద్యత్రయ ప్రబంధము ఆంధ్రీకరణము' అనే ప్రస్తుత గ్రంథాన్ని ప్రచురించాము. ఈ గ్రంథాన్ని విశేషంగా ఆదరిస్తారని ఆశిస్తూ–

*సదా శ్రీవారి సేవలో....*

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

శ్రీమతేరామానుజాయనమః

## -వినతి-

# గద్యత్రయ ఆంధ్రీకరణము

శ్రీ భగద్రామానూజుల గద్యత్రయ ప్రబంధాన్ని ఆంధ్రీకరించవలెనని 2008లోనే ఆలోచన వచ్చింది. అప్పుడే ప్రారంభించాను. కాని ఏకాగ్రత నిలుపలేక పెద్ద పెద్ద సమాసములలో ఆ గద్యము ఉండడం వలన, దానిని ఏ విధంగా అనువదించాలో అనే ఆలోచనలో పడిపోయాను. నాకు అంత సంస్కృతజ్ఞానం, సంప్రదాయ పరిజ్ఞానం లేకపోవటం కూడ ఇలాంటి ఆలోచనకు ఒక కారణం.

గద్యత్రయాన్ని ఎవరైనా మహానుభావులు ఆంధ్రీకరించారేమో కాని నాకు తెలియదు. అసలు ఇలా అనునదించాలని ఆలోచన నాకు రావటానికి ఒక కారణం ఉన్నది.

2008 కంటె ముందే ఒకసారి బెంగళూరులో ఉంటున్న మా కుమారుడు చి॥ క్షీరాభిశయనం అయ్యంగార్, నా గొంతు (స్వరం) వినటానికి ఎప్పుడూ తన దగ్గర ఉండాలి అనే కోరికతో కావచ్చు, “ఏదైనా నీవు చదువునాన్నా, నేను రికార్డు చేసి వీడియో తీస్తాను” అని అన్నాడు – ఏది చదవాలి? అని ఆలోచించి “సరే” అని వాడితో అనినాను. “సుమారు అరగంట ఉండేటట్లు చూడు” అని కూడ “క్షీరం” చెప్పాడు. అందువల్ల “గద్యత్రయం” అపుడే అరగంటలో పూర్తి చేయవచ్చును అని అనుకొని, ఒకటి రెండుసార్లు టైమ్ పెట్టుకొని చదివి, అరగంటకు మించకుండా పఠన వేగాన్ని సరిచేసుకున్నాను.

ఒకనాడు రికార్డు చేశాడు. గద్యత్రయం మూలం చదవటానికే అరగంట పట్టింది. దానిని తన కంప్యూటర్‌లో లోడ్ చేసుకున్నాడు. ఒక సి.డి. తయారు చేశాడు. ఆ సి.డి పెడితే ఎప్పుడైనా వినవచ్చు. చదువుతున్నట్లు ఉన్నా నా ఫోటో చూడవచ్చు. అలా డి.వి.డి డిస్కు తయారుచేసి ఇచ్చాడు.

మేము హనుమకొండలో ఉంటూ ఉంటాము కాబట్టి మేము బెంగుళూరు నుంచి వెళ్లేటప్పుడు ఆ డివిడి డిస్కును కూడ హనుమకొండకు తీసికొని వెళ్లాను. హనుమకొండలో మా కుమారుడు చి॥శార్ఙ్గపాణి అయ్యంగార్ ఉంటున్నాడు.

ఒకనాడు ఆ డివిడిని చూడమని మా కుమారుడికి ఇచ్చాను. మా కోడలు చి॥ల॥సౌ॥కృష్ణవేణి సంప్రదాయ విషయాలపై ఆసక్తికలది. ఇద్దరూ ఆ డిస్కును చూచారు. విన్నారు. కాని అది అంతా సంస్కృతము దీర్ఘ సమాస భూయిష్ఠము. అందుచేత అదివారికి అంతగా అర్థముకాక పోవచ్చును.

ప్రసంగవశాత్తు ఒకనాడు వారితో ఆ డిస్కు విషయం మాట్లాడినాను. "అలా కేవలం సంస్కృతంలో ఉన్న గద్యత్రయ ప్రబంధాన్ని చదువితే ఏమి ప్రయోజనం? అది కూడ చాలా త్వరత్వరగా చదివినావు. దానికి తెలుగులో అర్థం చెప్పుతూ చదువితే బాగుంటుంది. అందరికీ దాని అర్థం తెలుస్తుంది కదా" – అని వారు అన్నారు. నాకు కూడ నిజమే అనిపించింది. ఏ విధంగానైనా, నాకు తెలిసిన రీతిలో, తెలుగులో గద్యత్రయాన్ని అనువాదం చేద్దామని ఆలోచన బలపడింది. ఆ ఆలోచన ఫలితమే 2008లో ప్రారంభించిన నా యీ అనువాద కార్యక్రమం.

గద్యత్రయాన్ని ఎలా ఆంధ్రీకరించాలి అని ఆలోచిస్తూనే 2 సంవత్సరాలు గడచిపోయినాయి. – ఇలా ఉండగా ...

జనవరి 2010లో 'క్షీరం' తమతో పాటు మమ్మల్ని (మా దంపతులను) తన మామగారు  అత్తగార్లకు దక్షిణదేశయాత్రలకు తీసికొని వెళ్లాడు. సుమారు 40 శ్రీవైష్ణవ దివ్యక్షేత్రాలను సందర్శించాము.

ఆ ప్రయాణంలోనే చివరగా "శ్రీరంగం" దివ్యక్షేత్రం వెళ్లాము. శ్రీరంగనాథుణ్ణి సేవించుకొనిన తరువాత అదే ప్రాంగణంలో ఉన్న వివిధ సన్నిధులలో కొన్నిటిని సేవించుకొనినాము. అలా సేవించుకున్న సన్నిధులలో "ఉదయవరుల సన్నిధి" ఒకటి.

అక్కడి ఉడయవరులు సన్నిధిలోని ఉడయవరుల అర్చామూర్తికి ఒక విశేషమున్నది. శ్రీ భగవద్రామానుజులు పరమపదము వేంచేయునప్పుడు తమ  శక్తి లోని 1/3వ వంతు శక్తిని ఈ అర్చామూర్తిలో నిక్షిప్తం చేశారు అని సంప్రదాయం. మిగతా 1/3వ వంతు శక్తిని "తిరునారాయణా పురం"లోని అర్చామూర్తిలో, మిగాతా 1/3వ వంతు శక్తిని "తిరుమలై" లోని అర్చామూర్తిలో నిక్షిప్తంచేశారట.

ఉడయవరుల సన్నిధిలో ఆ అర్చామూర్తిని సేవించుకుంటున్నప్పుడు నాకు ఈ విషయం గుర్తుకు వచ్చింది. భగవద్రామానుజులు ఈ మండపంలో ఉండియే 'గద్యత్రయ' ప్రబంధాన్ని రచించి కృపచేశారనికూడా గుర్తుకు వచ్చింది. ఎట్లైనా శ్రమపడి ఆ అపూర్వ గద్యత్రయప్రబంధాన్ని అనువదించాలనే నా కోరిక బలీయమైనది. ఉడయవరులను ప్రార్థించినాను. నా యీ చిన్ని ప్రయత్నాన్ని నిర్విఘ్నంగా కొనసాగించమని వేడుకున్నాను.

ఒకటి రెండురోజుల్లో ఇంటికి అంటే బెంగుళూరుకు వచ్చాము. అప్పుడు ఈ అనువాద కార్యక్రమం ప్రారంభించాను.

పెద్ద పెద్ద సమాసములతో ఉన్న మిశ్రిత వాక్యాలను విడగొట్టుకుంటూ అనువాదం సాధ్యమైనంతవరకు చిన్నచిన్న వాక్యాల్లో ఉండేటట్లు చూచుకుంటూ అనువాదం చేశాను. పెద్ద పెద్ద ఖండాలను (పేరా) సూక్ష్మఖండికలుగా విభజించుకొని, గద్యత్రయమూల భాగమును వ్రాయుచు, దాని క్రిందనే అనువాదము వ్రాయుచూ పూర్తిచేశాను.

అనువాదాలు అనేక రకాలుగా ఉంటాయి. నా యీ అనువాదం ఏ ఒక్క అనువాద రీతి కాదు. అవసరం అనుకున్న రీతిలో మార్చుకుంటూ ఒక్కొక్కచోట శబ్దానువాదం, ఒక్కొక్కచోట వాక్యానువాదం, ఒక్కొక్కచోట భావానువాదం, ఒక్కొక్కచోట వివరణ పూర్వకానువాదం – ఇలా వ్రాస్తూ వచ్చాను. నాకు తెలిసినంతలో మూలభావానికి విఘాతం రాకుండా, విఘాతంరాని రీతిలో, చూచుకున్నాను.

ఒక అజ్ఞుడను అయిన నేను, కేవలము ఉడయవరుల కృపాకటాక్షాన్నే ఊతగా తీసికొని రూపొందిచిన ఈ అనువాదం ఎన్నో లోపములతో ఉండవచ్చును. ఈ లోపములు నా అజ్ఞానం వలన కలిగినవే. అనువాదం పూర్తి కావటానికి భగవద్రామానుజుల కృపాకటాక్షమే కారణమని నా దృఢ విశ్వాసం.

అనువాదం చేసే వ్యక్తికి ఆరెండు భాషలలో "పట్టు" ఉండవలెనని భాషాశాస్త్ర నియమం. నాకు ఆ రెండు భాషలైన సంస్కృతము, తెలుగులలో పరిచయము మాత్రమే ఉన్నది కాని "పట్టు" లేదు అయినా సాహసంతో ప్రయత్నించాను. వీలు చేసుకొని దీనిని కూడ వీడియోతీసి, రికార్డు చేయమని "క్షీరం" తో చెప్పాలి.

సంప్రదాయ ప్రవర్తకులు, సంప్రదాయజ్ఞులు, భాషా, శాస్త్రవిదులు, పండితులు నా యీ ప్రయత్నాన్ని ప్రోత్సహిస్తారని, దోషాలను మన్నిస్తారని ప్రార్థిస్తున్నాను.

సామాన్యులకు ఈ అనువాదం వలన ఏమైనా ఉపయోగం కలిగినచో నేను ధన్యుడను అయినట్లు భావిస్తాను.

ఈ "గద్యత్రయం" శరణాగతి మంత్రసారము. శరణాగతి అంటే ఏమిటో క్లుప్తంగానైనా తమకు తెలిసినంత వరకు తెలుసుకొని, భగవానుడైన శ్రీమన్నారాయణునకు, వివిధ ప్రదేశములలో వేంచేసియున్న అర్చామూర్తులకు శరణాగతిచేసి ధన్యులగుదురని కాంక్షిస్తూ సెలవు తీసికుంటున్నాను.

**ఇట్లు**

**భాగవత పాదరేణువు.**

**కోరుకొండభట్టర్, రామానుజభట్టర్**

శ్రీ

శ్రీమతేరామానుజాయనమః

# గద్యత్రయ ప్రబంధము

# 3. శ్రీవైకుంఠ గద్యమ్

శ్లో॥ యామునార్య సుధాంభోధి మవగాహ్యయదామతి ।
ఆదాయ భక్తియోగాఖ్యం, రత్నం సందర్శయామ్యహం ॥

**మూలము (A) సంస్కృతము :-**

స్వాధీన త్రివిధ చేతనాచేతన స్వరూప స్థితి ప్రవృత్తి భేదం, క్లేశ కర్మాద్యశేష దోషా సంస్పృష్టం, స్వాభావికానవధికాతిశయ జ్ఞాన ఐశ్వర్య వీర్య శక్తి తేజః ప్రభృత్యసంఖ్యేయ కల్యాణ గుణగణౌఘ మహార్ణవం, పరమపురుషం, భగవంతం, నారాయణం, స్వామిత్వేన సుహృత్వేన గురుత్వేనచ పరిగృహ్య, ఏకాంతికాత్యంతిక తత్పదాంబుజద్వయ పరిచర్యైక మనోరథః తత్ప్రాప్తమేచ తత్పదాంబుజ ద్వయ ప్రపత్తేః అన్యన్నమే కల్పకోటి సహస్రేణాపి సాధన మస్తీతి మన్వానః --- (శరణమనుప్రజేత్ ఇతి అన్వయః).

**అనువాదము తెలుగు :-**

(ఈ ఖండికలో శ్రీమన్నారాయణ గుణవర్ణనము వర్ణించడినది) త్రివిధ (భూచరములు, జలచరములు, ఖేచరములు. అను 3 విధములైన) చేతనముల యొక్క, ఇట్లే అసంఖ్యాకమైన అచేతనముల యొక్క, విభిన్నమైన స్వరూప స్థితి ప్రవృత్తులు తనస్వాధీనమందు కలవాడు స్వామి - (సర్వాంతర్యామి అని అర్థము). క్లేశము (కష్టము), కర్మలు (కర్మబంధములు) మొదలైన అనంతదోషములు ఏమాత్రము అంటనివాడు స్వామి - అట్టి స్వామి యొక్క కల్యాణగుణములు స్వాభావికమైనవి, అనంతమైనవి. ఎంతో అతిశయించినవి (గొప్పవి). అవి జ్ఞానము, బలము, ఐశ్వర్యము, వీర్యము, శక్తి, తేజస్సు అనుషడ్గుణములు, వీటిచే పరిపూర్ణుడు స్వామి -

పరమపురుషుడు, పురుషోత్తముడు, భగవంతుడు (అష్టైశ్వర్య సంపన్నుడు), అయినవాడు శ్రీమన్నారాయణుడు. అట్టి శ్రీమన్నారాయణుని స్వామిగా, స్నేహితునిగా, గురువుగా తలచి గ్రహించి అత్యంతము ఏకాంతికమైన స్వామి వారి చరణారవింద పరిచర్యయందే మనోరథము (కోరిక) కలవాడై ఆ చరణారవిందమునే నాకు ప్రాప్యము (పొందతగినవి) అని తలచి వాటిని పొందుటకు స్వామివారి పదాంబుజద్వయప్రపత్తికంటె నేను చేయవలసినది లేదని, సహస్రకోటి కల్పముల తరువాత కూడ ఇతర సాధనములేదని తలచుచున్నవాడై --- (శరణమువేడవలెను అని అన్వయము),

**మూలము:-**(B) తస్యైవ భగవతో నారాయణస్య, అఖిల సత్త్వదయైక సాగరస్య, అనాలోచిత గుణాగుణాఖండ జనానుకూల అమర్యాద శీలవతః, స్వాభావికానవధికాతిశయ గుణవత్తయాదేవ తిర్యఙ్మనుష్యాద్యఖిల జన హృదయానందనస్య, ఆశ్రితవాత్సల్యైక జలధేః, భక్తజన సంశ్లేష భోగస్య, నిత్యజ్ఞానక్రియైశ్వర్య భోగసామగ్రీ సమృద్ధస్య, మహావిభూతేః, శ్రీమచ్చరణారవిందయుగలం అనన్యాత్మ సంజీవనేన, తద్గత సర్వభావేన శరణమనువ్రజేత్-

**అనువాదము:-** (ఈఖండికలో కూడ శ్రీమన్నారాయణ గుణవర్ణనము చేసి అట్టి స్వామిని రామానుజులు శరణువేడుచున్నారు.)

అట్టి భగవానుడైన శ్రీమన్నారాయణుడు జగత్తులోని అన్ని ప్రాణులపై స్వభావసిద్ధమై; దయాస్వభావము కలవాడు. ఇట్టి దయార్ద్ర హృదయయుడు కనుకనే, స్వామి తన అవ్యాజకృపాదృష్టిని దేవతలు, తిర్యగ్జంతువులు, మనుష్యులు మొదలైన ప్రాణికోటిపై ప్రసరింపచేయుచు, వారు ఎంతటి అమర్యాద ప్రవృత్తి కలవారైనను, వారి వారి అమర్యాదయుక్త గుణాగుణములను క్షమించి వారి హృదయములకు ఆనందమును కలుగజేయును. ఆయన ఆశ్రితులపాలిటి వాత్సల్యజలధి కదా! భక్తజనులన్న ఆయనకు ఇంకను ప్రీతి, వారితోనే కలసి ఉండవలయునని కోరుచుండు వాడు. ఆవిధముగా వారితో కలసి ఉండుటయే తనకు భోగ్యమని తలచువారు

– శాశ్వతమైన (నిత్యమైన) జ్ఞాన క్రియైశ్వర్యాది భోగసామగ్రి తన వద్ద కలవాడైననూ, భక్తజనుల సంశ్లేషమునే తనకు భోగ్యమని తలచువాడు స్వామి. అట్లు సంశ్లేషించుచూ, తన వద్దగల భోగసామాగ్రి ద్వారా ఆ భక్తులను ఆనందింపచేయుచు, వారు ఆనందించినచో తానుకూడ ఆనందించువాడు భగవంతుడు. మహావిభూతి కలవాడు. మహదైశ్వర్య సంపన్నుడు. అని తలచుచు ఆయన చరణారవిందయుగలమును ఆత్మసంజీవనహేతువైన అనన్యభావనతో, స్వామినే భావించుచు, సర్వాత్మనా స్వామివారిని శరణువేడవలెను.

**మూలము:–** (C) తతశ్చ ప్రత్యహం ఆత్మోజ్జీవనాయ ఏవమనుస్మరేత్

**అనువాదము:–** తరువాత, అనగా శ్రీమన్నారాయణుని శరణము వేడిన తరువాత ఆత్మోజ్జీవనము కొరకు ఎల్లప్పుడూ ఈ విధముగా స్మరించవలెను.

**మూలము 1 :–** చతుర్దశ భువనాత్మకం అండం, దశగుణోత్తరంచ ఆవరణ సప్తకం, సమస్తం కార్యకారణమతీత్య, పరమవ్యోమ శబ్దాభిధేయే బ్రహ్మాదీనాం వాఙ్మనసాగోచరే శ్రీమతి వైకుంఠే దివ్యలోకే .....

**అనువాదము:–** (ఈ ఖండిక చాల పెద్దదిగా ఉన్నది. అందువలన చిన్న విభాగములుగా జేసి, అనువాదము చేసినాను)

(ఈ ఖండికలో శ్రీవైకుంఠమును ఉడయవరులు వర్ణించుచున్నారు)

ఈ అండము (అనగా బ్రహ్మాండము) చతుర్దశ (14) భువనములు (లోకములు) కలది. దీనిచుట్టు 7 ఆవరణములు ఉన్నవి. ఆ ఆవరణము ఒక్కొక్కటి ఒకదాని కంటె రెండవది పది రెట్లు అధికమైన వర్తులమైనవి. ఇట్టి సమస్త కార్యకారణభూతమైన బ్రహ్మాండమును అతిక్రమించి, "పరమవ్యోమము" (పరమపదము) అనుపేరుగల ఒక స్థాన మున్నది. దీనినే "త్రిపాద్విభూతి" అని కూడ అందురు. ఇది లీలావిభూతి (ప్రకృతి) కంటె 3 రెట్లు పెద్దది. సమస్త ఆవరణయుక్త అండాంతర్గత చతుర్దశ భువనములు ఒకవంతు అయినచో (దీనిని లీలావిభూతి అందురు) "పరమవ్యోమము"

అని పిలువబడు "పరమపద దివ్యధామము" 3రెట్లు – ఈ పరమవ్యోమము బ్రహ్మాది దేవతలకు కూడ వాఙ్మనసాతీతమైనది. వారి వాఙ్మనస్సులకు కూడ కనిపించనిది. (అగోచరమైనది). అట్టి సర్వగుణసంపన్నమైన దివ్యలోకమైన శ్రీవైకుంఠములో --

**2. మూలము:–** సనక విధి శివాదిభిరపి అచింత్య స్వభావైశ్వర్యైః నిత్యసిద్ధైః, అనరితైః, భగవదాను కూల్యైక భోగైః, దివ్యపురుషైః మహాత్మభిః ఆపూరితే; --

**అనువాదము:–** (ఈ ఉపఖండికలోకూడ వైకుంఠ వర్ణనమే)

సనక సనందనాదులచేత, చతుర్ముఖ బ్రహ్మచేత, శివుని చేత, ఇట్లే ఇతర దేవతల చేత ఊహించుటకు కూడ వీలులేని స్వభావ ఐశ్వర్యములతో, నిత్యమైన సిద్ధపురుషులతో, అనంతమైన భోగములతో (ఇవి భగవదనుభవ భోగములే) దివ్యపురుషులతో, మహాత్ములతో ఆవైకుంఠము నిండియుండును –

**3. మూలము:–** తేషామపి ఇయత్పరిమాణం, ఇయదైశ్వర్యం, ఈదృశస్వభావమితి పరిచ్ఛేత్తు మయోగ్యే, దివ్య కల్పకతరూపశోభితే, దివ్యోద్యాన సహస్రకోటిభిరావృతే, అతిప్రమాణే, దివ్యాయతనే;...

**అనువాదము:–** (ఈ ఉపఖండికలో శ్రీవైకుంఠములోని ఉద్యానవర్ణనము) పరమపదవాసులైన నిత్యసూరులకు సహితము, ఇంత పరిమాణము కలదని (ఇంత వైశాల్యము కలదని అర్థము). ఇటువంటి స్వభావము కలదని, ఇంత ఐశ్వర్యము కలదని చెప్పుటకు ఈ వైకుంఠము వశముకానట్టిది. ఈ వైకుంఠములో దివ్యకల్పతరువులు అనేకములున్నవి. దివ్యఉద్యానములు అనేకములున్నవి. సహస్రకోటి దివ్యోద్యానములు అనినను తక్కువే. అది కూడ ఒక్కొక్క ఉద్యానము ఎంతో విశాలమైనది. అనంతమైన ప్రమాణములు (వైశాల్యము) కలిగిన దివ్యాయతనములు అనేకములున్నవి. (ఇక్కడ "ఆయతనము" అనుపదమునకు అర్థము చూడవలెను).

**4 మూలము:–** కస్మింశ్చిత్ విచిత్ర దివ్యరత్నమయ దివ్యాస్థాన మణ్డపే, దివ్యరత్నస్తంభ శతసహస్రకోటిభిరుపశోభితే, దివ్యనానారత్నకృతస్థల విచిత్రితే, దివ్యాలంకారాలంకృతే;...

**అనువాదము:–** (ఈ ఉపఖండికలో దివ్యాయతనమును, దివ్యమంటపమును వర్ణించుచున్నారు)

అసంఖ్యాకములైన దివ్యాయతనములు ఉన్నవి కదా! అవి అన్నియు, అనగా వాటిలోని దివ్యమంటపములు, దివ్య ఆస్థానమంటపములు ఎంతో అలంకార శోభితములై యున్నవి. విచిత్ర దివ్యరత్నములతో పొందబడిన, శతసహస్రకోటి (నూరువేలకోట్లు) దివ్య రత్నస్తంభములతో విరాజిల్లుచున్న ఆ దివ్యాస్థాన మంటపము ఎంతోమనోహరముగా ఉన్నది. ఆ ఆస్థానమంటపములో అసంఖ్యాకములైన విడివిడిగా ఉన్న స్థలములు ఉన్నవి. ఆయా స్థలములు ఒక్కొక్క స్థలము ఒక్కొక్కవిధమైన దివ్యరత్నములచే అనగా నానావిధ రత్నములతో చిత్రింపబడియున్నది – ఈ రత్నస్థగిత ఆస్థాన విభాగములు దివ్యాలంకార శోభితములై ఉన్నవి –––

**5. మూలము:–** పరితః పతితైః పతమానైః పాదపస్థైశ్చ నానాగంధవర్ణైః దివ్యపుష్పైః శోభమానైః దివ్యపుష్పోపవనైః ఉపశోభితే; సంకీర్ణ పారిజాతాది నిర్మిత దివ్యలీలామండప శతసహస్రోపశోభితైః సర్వదా అనుభూయ మానైరపి అపూర్వవత్ ఆశ్చర్యమావహద్భిః క్రీడాశైల శతసహస్రైః అలం కృతైః;.....

**అనువాదము:–** (ఈ ఉపఖండికలో క్రీడా శైల వర్ణనము చేయుచున్నారు.) దివ్యాస్థాన మంటపములు ఉన్నవికదా! వాటిచుట్టు వివిధ పారిజాత వృక్షములున్నవి. ఆవృక్షములనుండి క్రిందపడిన పువ్వులు, చెట్లనుండి విడిపోయి క్రిందపడుటకు సిద్ధముగా ఉన్న పువ్వులు, చెట్ల మీదనే ఉన్న పువ్వులు – ఇట్టి దివ్యపుష్పములతో ఆవృక్షములు శోభామయానముగా ఉన్నవి. అట్టివే అనేక పుష్పోపవనములు ఉన్నవి. ఆ పుష్పోపవనములలో కల వివిధ పుష్పముల యొక్క సౌరభములతో ఆ ప్రాంతము విరాజిల్లుచున్నది. ఆ ప్రాంతము అంతయు వివిధ పారిజాత వృక్షములతో శోభాయమానముగా ఉన్నది. సంకీర్ణ కల్పద్రుమములు కొన్ని ఉండగా అసంకీర్ణ కల్పద్రుమములు కొన్నిఉన్నవి. కొన్ని సహజమైన కల్పవృక్షములు. కొన్ని కృత్రిమముగా సహజకల్పవృక్షములవలెనే నిర్మింపబడినవి ఉన్నవి. వీటికి అనగా

కృత్రిమకల్పద్రుమములకు ఉన్న పుష్పములుకూడ, పుష్పములవంటి వర్ణములుగల రత్నములచే నిర్మింపబడియున్నవి. అట్టివి కూడ అసంఖ్యాకముగా ఉన్నవి. అచ్చటచ్చట లీలామంటపములు శతసహస్రములున్నవి. వీటి సౌందర్యమును, శోభను ఎంతసేపు, ఎన్ని మారులు చూచినను క్రొత్త క్రొత్తగానే కనిపించు శోభకలిగినవి ఇప్పుడే వీటిని చూచితిమి కదా ఇంతలో ఇట్లు క్రొత్తగా ఎట్లు కనిపించుచున్నవి! అని ఆపుష్పద్రుమ నవనవోన్మేషత అత్యంతఆశ్చర్యమును కలిగించుచున్నది. ఇట్టివాటిచే శోభించుచున్న శత సహస్ర క్రీడాశైలములచే ఆవైకుంఠము అలంకరింపబడి శోభాయమానముగా ఉన్నది.

**6. మూలము:-**కైశ్చిన్నారాణ దివ్యలీలా సాధారణైః, కైశ్చిత్ పద్మవనాలయా దివ్యలీలాసాధారణైః, శుకసారికామయూరకోకిలాదిభిః కోమలకూజితైః ఆకులైః దివ్యోద్యాన శతసహస్రకోటిభిరావృతే--

**అనువాదము:-** (ఈ ఉపఖండికలో శుకసారికాదుల కూజితధ్వని సౌందర్యము వర్ణింపబడినది)

దివ్యోద్యానములు శతసహస్రములు ఉన్నవి కదా! ఆ ఉద్యానములలో శుక (చిలుకలు) సారికా (గోరింకలు), మయూర (నెమళ్లు), కోకిల (కోయిలలు) మొదలగు పక్షులు కూయు కూతల వివిధధ్వనుల చేత ఆ ఉద్యానములు ఆకులముగా (వివిధ ధ్వనుల వలన కలిగిన సంచలనము లతో) ఉన్నవి. అట్టి వివిధ దివ్య పక్షిరాజములలో కొన్ని శ్రీమన్నారాయణునిచే లాలింపబడునవి, మరికొన్ని పద్మవనాల అయిన శ్రీలక్ష్మీదేవిచే లాలింపబడు నవి, అనగా ఆ దివ్యపక్షిరాజముల ఆకూతముల మధ్యగా శ్రీలక్ష్మీ నారాయణులు విహరించు ఉద్యానములు ఆవైకుంఠధామములో శతసహస్రకోటులు ఉన్నవి. అట్టివాటిలో ఆ వైకుంఠము ఆవరింప బడియున్నది.

**7. మూలము:-** మణి ముక్తా ప్రవాలాలంకృత సోపానైః, దివ్యమాలామృత రసోదకైః, దివ్యాండజపరైః, ఆకులైః, అన్తస్థి ముక్తామయ దివ్యక్రీడా

స్థానోపశోభితైః, దివ్యసౌగంధిక వాపీ శతసహస్రైః దివ్యరాజహంసావలీవిరాజతైః ఆవృతే, నిరస్తాతిశభూనంద్రైక రసతయాచ, అనన్యాచ్చ ప్రవిష్టానున్మాదమద్భిః క్రీడోద్దేశైః విరాజితే;...

**అనువాదము:–** (ఈ ఖండికలో క్రీడాస్థానమంటపముల సోపాన వర్ణనము, సరోవరవర్ణనము చేయబడినది)

అచ్చటగల క్రీడాస్థానములలోని మంటపములకు నిర్మింపబడిన సోపానములు వివిధ మణులతో, ముత్యములతో అలంకరింపబడి నిర్మించబడినవి – దివ్యపుష్పమాలలు ప్రకాశించుచున్నవి. ఆపుష్పముల నుండి అమృతమువంటి మధువు స్రవించుచున్నవి. ఆమధువుతో ఆ సోపానములు కొంచెము కొంచెముగా ద్రవీభవింప బడుటచే (తడుపబడుటచే) సుపరిమళము వ్యాపించుచున్నది. ఆ పరిమళాఘ్రాణమునకు దివ్యాండజములు, అనగా దివ్యతిర్యక్‌జంతువులు, (భ్రమరములు= తుమ్మెదలు మొదలగునవి) అచ్చట అంతటను వ్యాపించియున్నవి. అచ్చట శతసహస్ర వాపీ (దిగుడు బావులు) వ్యాప్త ప్రదేశములున్నవి. ఆ దిగుడు బావులలో కూడ వివిధ పరిమళములను వెదజల్లు వివిధ పుష్పములు వికసించియున్నవి. ఆబావులలో, ఆసౌగంధిక పుష్పముల నడుమ రాజహంసలు క్రీడించుచున్నవి. సాటిలేని అతిశయానంద కరములై రసోత్ప్రేరకములైన అనేక క్రీడా స్థానములు అచ్చట ఉన్నవి. ఇంకను అనేకములైన మాదక ప్రవృద్ధి కరములైన వస్తుచయముగల క్రీడాస్థానములతో క్రీడోద్యానములతో ఆ "శ్రీవైకుంఠము విరాజిల్లుచున్నది."

**8. మూలము:–** తత్ర కృత దివ్యపుష్పపర్యంకోపశోభితే, నానా పుష్పాసవాస్వాదమత్తభృంగావలీభిః ఉద్గీయమాన దివ్యగాంధర్వేణ ఆపూరితే, చందనాగరు కర్పూర దివ్యపుష్పావగాహిమందానిల, సేవ్యమానే, మధ్యే పుష్పసంచయవిచిత్రితే, మహతి, దివ్యయోగ పర్యంకే అనంతభోగిః; (శ్రియాసహ ఆసీనం –– అన్వయం).

**అనువాదము:–** (ఈ ఉపఖండికలో దివ్యపుష్పపర్యంకమును వర్ణించుచున్నారు.)

అచ్చట గల దివ్యోద్యానములలో అచ్చటచ్చట దివ్య పుష్పములతో శోభాయమానముగా ఉన్న పర్యంకములు (మంచములు లేదా మంచముల వంటివి, సోఫాలవంటివి) ఉన్నవి. ఆ ఉద్యానములో వివిధ రసభరిత పుష్పములనుండి ఆసవములను పరిమళయుక్త రసమును ఆస్వాదించి మత్తెక్కిన తుమ్మెదలు .... తమతమఇష్టమైనరీతిలో (మత్తెక్కి ఉన్నవి కదా) ఝుంకారములు చేయుచున్నవి. ఆ ఝుంకారముల ధ్వని గాంధర్వ ధ్వనియో అనిపించుచున్నది. ఆ ప్రాంతమంతయు అట్టి ఝుంకార ధ్వనితో పూరింపబడియున్నది. మందానిలము (పిల్లగాలి) వీచుచున్నది. ఆ మందానిలము, గంధము, అగరువత్తుల పరిమళము (ఆ అగరు వత్తులు కస్తూరితో చేయబడినవి కనుక కస్తూరికా పరిమళమును కలిగియున్నవి) కర్పూరము, ఇట్టి సుగంధ పరిమళద్రవ్యములపై నుండి అనగా వాటిని తాకుచూ ఆ మందానిలము వీచుచున్నది. ఆ మందానిల స్పర్శచే మధ్యమధ్యరాలిన వివిధ పుష్పములున్నవి. ఇట్టి ఎంతో మహిమాన్వితమైనది ఆ పర్యంక ప్రాంతము. కాని స్వామిని మాత్రము అట్టి సుగంధయుక్తమైన పర్యంకము వేరే ఏదోకాదు. అది అనంతుడను శయ్యయే. అనంతుడే అట్టి శయ్యగా పరిణమించి స్వామి సేవ, కైంకర్యము, చేయుచున్నాడు -- 'నివాస శయ్యాసనపాదుకాదిషు"-- అని కదా అనంతుని వర్ణనము. అట్టి అనంతుడు శేషత్వమే ప్రధానముగా కలవాడై ''శేషుడు'' అని పిలువబడుచున్నవాడే - అట్టి శేషపర్యంకము కలది ఆ దివ్యోద్యానము - ఆపర్యంకము పై అనగా అనంతునిపై స్వామి పవళించియున్నాడు.

**9. మూలము:-** శ్రీమద్వైకుంఠ ఐశ్వర్యాది దివ్యలోకం, ఆత్మకాంత్యా, భగవతః తత్తదవస్థోచిత పరిచర్యాయాం ఆజ్ఞాపయంత్యా, శీలరూపగుణ విలాసాదిభిః ఆత్మానురూపయా, శ్రియాసహఆసీనం;

**అనువాదము:-** (ఈ ఉపఖండికలో, స్వామివారికి పరిజనములు ఎట్టి కైంకర్యములు చేయవలయునో ఆజ్ఞాపించు శ్రీదేవి వర్ణింపబడినది)

స్వామి, అట్టి శేషపర్యంకరముపై పవళించియున్నాడు. శ్రీ మహాలక్ష్మితో కలసి శ్రీమన్నారాయణుడు ఆసీనుడైయున్నాడు. ఆ వైకుంఠము ఐశ్వర్యాది సంపదలతో విరాజిల్లుచున్న దివ్యలోకముకదా! పిరాట్టి (శ్రీదేవి) అట్టి త్రిపాద్విభూతిని, మరియు లీలావిభూతిని తన సహజమైన కాంతిచేత ప్రకాశింపచేయుచున్నది. అచటి ముఖ్యపరివారములో శేషుడు, శేషాశనుడైన వైనతేయుడు (గరుడుడు) ఉన్నారు కదా! వారికి, తదితరపరిజనమునకు, ఆయా పరిస్థితులకు తగినట్లు స్వామివారికి పరిచర్యలు చేయుచుండుడని శ్రీలక్ష్మీపిరాట్టి ఆజ్ఞాపించుచున్నది. ఆమె భగవానుని ప్రక్కనే ఉండి స్వామి "శ్రీమన్నారాయణుడు" అను సార్థకనామము కలిగియుండునట్లు చేయుచున్నది. (ఇచట ఒక విశేషమును అనుసంధించుకొనవలెను. శేషుడు, శేషాశనుడైన గరుడును శత్రువులు కదా! అయితే తనకైంకర్యము చేయుటకు ముఖ్యులుగా నియమించుకొనుట విచిత్రమే కదా! అయితే రాగద్వేషములకు అతీతమైనదికదా త్రిపాధ్విభూతి. అందుచే వారిలో పరస్పరము వైరభావము కొంచెము కూడ ఉండదు. అట్లు స్వామియే చేసినాడని తలచవచ్చు. స్వామివారి సౌకుమార్య మహిమ కూడ అట్టిదే. ఆసౌకుమార్యమును దర్శించుచు ఇతరభావములకు ఏ మాత్రము స్థానములేని స్థితిఅది. స్వామి సన్నిధిలో అందరూ సమానముగా ఉందురు. ఇదే స్వామి మహిమ. స్వామివైభవము) -- స్వామివారికి ఎప్పుడు ఎటువంటి సేవ ఇష్టమో పిరాట్టికి పూర్తిగా తెలయునుకదా! అట్టి కైంకర్యమును చేయించుట తన కర్తవ్యము కదా! ఆమె నిత్యానపాయిని. విష్ణువక్షస్థలస్థిత కదా! ఆమె స్వామి వారి యొక్క శీల, రూప, గుణ విభూతులు మొదలైన కల్యాణ గుణములే తనకు కూడ కల తల్లి కదా! అందులకే ఆమె ఆత్మానురూపమైనదని కీర్తింపబడుచున్నది. స్వామి అట్టి శ్రీలక్ష్మీపిరాట్టితో కలసి శేష పర్యంకము పై విరాజిల్లుచున్నారు.

**10. మూలము:-** ప్రత్యగ్రోన్మీలిత సరసిసదృశనయనయుగలం, స్వచ్ఛ నీలజీమూతసంకాశం, అత్యుజ్జ్వల పీతవాససం, స్వయా ప్రభయా అతి

నిర్మలయా అతిశీతలయా అతికోమలయా స్వచ్ఛమాణిక్యాభ భూకృత్స్నం జగత్ భాసయంతం అచింత్య దివ్యాద్భుత నిత్య యౌవన స్వభావ లావణ్యమయామృతసాగరం అతిసౌకుమార్యాత్ ఈషత్ ప్రసన్నవదన లక్ష్యమాణ లలాట ఫలక దివ్యాలకావలీవిరాజతం, ప్రబుద్ధముగ్ధాంబుజ చారులోచనం, సవిభ్రమభ్రూలతం, ఉజ్జ్వలాధరం, శుచిస్మితం, కోమలగండం, ఉన్నసం, ఉదగ్రపీనాంస విలంబి కుండలాలకావలీ బంధురకంబుకంధరం, ప్రియావతం సోత్పల వర్ణ భూషణ శ్లథాలకాబంధ విమర్ద శంసిభిః భుజైః విరాజితం, అతికోమల దివ్య రేఖాలంకృత తామ్రకరతలం, దివ్యాంగులీయ విరాజితం, అతికోమల దివ్యనాఖావలీ విరాజితాభిః అంగులీభిరలంకృతం, తత్ క్షణోన్మీలిత పుండరీక సదృశ చరణయుగలం;

**అనువాదము:–** (ఈ సూక్ష్మ ఖండికలో స్వామి వర్ణనము చేయబడినది)

అప్పుడే వికసించిన పద్మములవంటి నయనములు కలవాడు స్వామి– ఆస్వామి స్వచ్ఛమైన నల్లని మేఘము వంటివాడు. ఎంతో ప్రకాశవంతమైన పీతాంబరమును ధరించినవాడు, అతినిర్మలమైన, అతిశీతలమైన, అతి కోమలమైన, తనకాంతితో స్వచ్ఛమైన కాంతిని విరజిమ్ముచున్న మాణిక్య ప్రకాశముతో సమస్త జగత్తును ప్రకాశింప చేయుచు, ఊహించుటకు గూడ శక్యముగాని దివ్యమైన అద్భుతమైన, నిత్యయౌవనము కల లావణ్యముతో కూడి, అమృత సాగరమువలె ఉండువారు. అతి సౌకుమార్యము కలవాడు – ఆసౌకుమార్యమువలన కొంచెము నిగనిగలాడు వదనము కలవాడు. ఆ వదనముపై కనిపించు లలాటఫలకముపై అటునిటు కదలుచున్న ముంగురులు కలవాడు. ప్రబుద్ధముగ్ధములైన (వికసించగా అతి మనోహరముగా నున్న) పద్మములవంటి సుందరములైన లోచనద్వయము కలవాడు. విభ్రమము తొణికిసలాడు భ్రూయుగ్మము కలవాడు. (ఆశ్చర్యమును కలిగించు కనుబొమ్మలు కలవాడు). ఉజ్జ్వలమైన అనగా ప్రకాశవంతమైన అధరము కలవాడు. చిరునవ్వుతొణికిసలాడుచుండువాడు. ముందుకు కొంచెము

పొడవుగా ఉన్న కోమలమైన చిబుకము కలవాడు. (చిబుకము కొంచెము ముందుకు దాటునట్లు ఉండుట అతిమానుష సౌందర్యమునకు చిహ్నమని అందురు) వెడల్పుగా ఉన్న వర్ణములపై నుండి వ్రేలాడుచున్న అలకాసౌందర్యము, ఆ సుందరకేశపాశము కంఠముపై పడుచుండగా ఎంతో సౌందర్యము ఉట్టిపడుచున్న కంఠము కలవాడు – ప్రియమైన ఉత్పలములచే, వివిధ పుష్పములచే, వాటిని వివిధ వర్ణములే భూషణములుగా గలవాడు (ఉత్పలములు అనగా కలువపువ్వులు వివిధ వర్ణములలో ఉండును) ఆ పుష్పములు శిథిలముకాగా అనగా ఆ పువ్వులు ఊడి పడుచుండగా ఆపుష్పఖండములు (రెమ్మలు) భుజములపై పడుచుండగా ఎంతో ప్రకాశమానమైన భుజద్వయము కలవాడు. కొంచెము ఎరుపువర్ణము గల అతికోమల కరతలములపై దివ్యరేఖలు కలవాడు. దివ్యమైన అంగులీయకములు (ఉంగరములు) కలవాడు. అతికోమలమైన నఖములుకలవ్రేళ్లతో విరాజిల్లుచుండువాడు. అప్పుడే వికసించిన పుండరీకముల (ఎఱ్రతామరలు)వలె ఉన్న చరణయుగళము కలవాడు భగవానుడు–

**11. మూలము:–** అతిమనోహర కిరీటమకుట చూడావతంసమకరకుండల గ్రైవేయక హారకేయూర కటక శ్రీవత్సకౌస్తుభ ముక్తదామోదర బంధన పీతాంబర కాంచీగుణ నూపురాదిభిః అత్యంత సుఖస్పర్శైః దివ్యగంధైః భూషణైః భూషితం, శ్రీమత్యా వైజయంత్యా వనమాలయా విరాజితం;...

**అనువాదము:–** (ఈ ఉపఖండికలో స్వామియొక్క భూషణశోభ వర్ణింపబడినది).

స్వామి దివ్య సుగంధ భరిత భూషణములచే విరాజితుడై ఉన్నారు– అతిమనోహరమైన కిరీటము, మకుటము, చూడావతంసములతో ప్రకాశించుచున్నారు. మకరకుండల, (కర్ణాభరణములు) గ్రైవేయకహార (కంఠాభరములు) కేయూరకటక, (భుజ కంకణభరణములు) శ్రీవత్స కౌస్తుభ,

(హృదయాభరణములు) ముక్తాదామోదర బంధన (కటి, నడుము భూషణ విలువైన ముత్యములదండలు) ములతో విప్పారుచున్నారు. కాంచీగుణ (మొలత్రాడు) (ముక్తాదామోదర బంధన కాంచీగుణ. అని అన్వయము, పీతాంబరము (ధరించిన పసుపు పచ్చని పట్టువస్త్రము) మొదలైన ఆభరణములచే స్వామి ప్రకాశించుచున్నారు. ఇదేగాక, మహిమాన్వితమైన "శ్రీమత్ వైజయంతి" అని పేరు కల వనమాలను కంఠమునందు ధరించినవాడై వనమాలా విరాజితుడై "వనమాలి" అని కీర్తింపబడుచున్నవాడు –

**12. మూలము:–** శంఖచక్ర గదాసి శార్ఙ్గాది దివ్యాయుధైః సేవ్యమానం, స్వసంకల్ప మాత్రావక్లుప్త జగజ్జన్మస్థితి ధ్వసాదికే శ్రీమతి విష్వక్సేనేన్యస్త సమస్త ఆత్మైశ్వర్యం, వైనతేయాదిభిః స్వభావతో నిరస్త సమస్త సంసారిక స్వభావైః భగవత్పరిచర్యాకరణ యోగ్యైః భగవత్ పరిచర్యైక భోగ్యైః నిత్యసిద్ధై అనంతైః యథా యోగ్యం సేవ్యమానం;...

**మూలమునకు అనువాదము:–** ( ఈ సూక్ష్మ ఖండికలో స్వామి సేవించుచున్న దివ్యాయుధములను, అనంత గరుడ విష్వక్సేనులను వర్ణించుచున్నారు)

శంఖము, చక్రము, గద, అసి (ఖడ్గము) శార్ఙ్గము (ధనస్సు) – అను పంచాయుధములు ప్రధానమైనవి. ఇతర ఆయుధములు ఎన్నో ఉన్నవి – "సర్వ ప్రహరణాయుధః" – అనికదా స్వామికి పేరు. అట్టి దివ్యాయుధములచే ఎల్లప్పుడు సేవించబడుతూ ఉండేవాడు స్వామి. అయన తన సంకల్ప మాత్రము చేతనే జగత్ సృష్టి స్థితి లయములను కలిగించు శక్తులను, ఇట్లే ఇంకను అనేకమైన శక్తులను, తనకు బదులు నీవే భరిస్తూ ఉండమని విష్వక్సేనులకు (సేనాపతికి) ఒప్పగించి, తన ఐశ్వర్యమంతయు అనగా జ్ఞానమైశ్వర్యాది షడ్గుణములను, వాటికి గల శక్తిని కూడ విష్వక్సేనులవారికి ఒప్పగించి స్వామి హాయిగా విశ్రాంతిగా ఉన్నారు. స్వాభావికముగానే సంసారిక భోగములను త్యాగముచేసి, స్వామివారి కైంకర్యమునందే సదాచిత్తుడైనాడు వైనతేయుడు (గరుడాళ్వారు), అనంతుడు (ఆదిశేషుడు)

మొదలైనవారు, అట్లు తాము పరిచర్యలు చేయుటయే తమకు భాగ్యముగా ఉన్నదని తలచుచు సపర్యలు చేయుచుండగా వారి సపర్యలను స్వీకరించుచున్నారు స్వామివారు.

**13. మూలము:–** ఆత్మభోగేన అనుసంహిత పరాదికాల దివ్యామల కోమల అవలోకనేన విశ్వమాహ్లాదయంతం, ఈషదున్మీలిత ముఖాంబుజోదర వినిర్గతేన దివ్యాననారవింద శోభాజననేన, దివ్య గాంభీర్య ఔదార్య మాధుర్యాద్యనవధిక గుణగణ విభూషితేన, అతి మనోహర దివ్య భావగర్భేణ, దివ్యలీలామృతేన, అఖిల జన హృదయానరాణ్యా పూరయంతం భగవంతం నారాయణం, ధ్యానయోగేన దృష్ట్వా, తతో భగవతో నిత్యస్వామ్యం ఆత్మనో నిత్యదాస్యంచ యధావస్థిమనుసంధాయ....

**అనువాదము:–** (ఈ సూక్ష్మ ఖండికలో విశ్వమును ఈషదున్మీలిత నేత్రములతో వీక్షించు, హృదయానందకరముగా ఉన్న శ్రీమన్నారాయణుని వర్ణన, మరియు అట్టి స్వామిని ధ్యానయోగముచే దర్శించుట వర్ణింపబడినది).

తన విలాసము కొరకే సృష్టింపబడిన లోకములను, తన దివ్యమైన స్వచ్ఛమైన కోమలమైన వీక్షణములచే (చూపులచే) వీక్షించుచు (చూచుచు) ఆ యా లోకములకు ఆహ్లాదమును స్వామి కలిగించుచున్నాడు. ఇట్లు ఆహ్లాదమును కలిగించు స్వామి వీక్షణము, కొంచెము వికసించిన అంబుజ సదృశ (పద్మము వలె ఉన్న) ఆననము నుండి బయలువెడలిన దివ్యారవింద శోభను కలిగినట్టిది. దివ్యమైన గాంభీర్య ఔదార్య, మాధుర్యాది అనంత గుణగణములచే ఆన్యూనన వీక్షణముతో ప్రకాశించుచున్నట్టిది ఆ ఆననము. ఆ వీక్షణము అతిమనోహరమైన దివ్యభావగర్భితమైనది. (స్వామి చూపులో ఎన్నో దివ్యభావములు అంతర్గతమై ఉన్నవి అని అర్థము) ఆ దివ్యామృత సమమైన వీక్షణముచే అఖిల జనుల హృదయములను పూరించి ఆనందపరచుచున్నారు స్వామి. అట్టి షడ్గుణ పరిపూర్ణుడైన (భగవంతుడైన) శ్రీమన్నారాయణుడు విరాజిల్లుచున్నారు. ఆస్వామిని ధ్యానయోగముచే చూచి

జీవుడు, తాను భగవంతునితో ఎల్లప్పుడు స్వామ్యము కలగియుండ వలెనని (సాయుజ్యం) ఎల్లప్పుడు స్వామికి దాసుడై దాస్యము చేయు చుండవలయునని అనుసంధించుచు ఉండవలెను.

**14. మూలము:-** కదాహం భగవంతం నారాయణం, మమకులధనం, మమ కులదైవతం, మమ కులనాథం, మమభోగ్యం, మమ మాతరం, మమ పితరం, మమ సర్వం సాక్షాత్కర వాణి చక్షుషా? కదాహం భగవత్ పాదాంబుజద్వయం శిరసా సంగ్రహిష్యామి? కదాహం భగవత్ పాదాంబుజ ద్వయ పరిచర్యాకరణ యోగ్యః తదేకభోగః తత్పాదౌ పరిచరిష్యామి? కదా మాం భగవాన్ స్వలీయయా అతిశీతలయా దృశా అవలోక్యస్నిగ్ధ మధుర గంభీర మధురయాగిరా పరిచర్యాయాం ఆజ్ఞాపయిష్యతి? ఇతి భగవత్పరి చర్యాయాం ఆశాం వర్ధయిత్వా తమైవ ఆశయా తత్ప్రసాదోపబృంహితయా భగవంతం ఉపేత్య....

**అనువాదము:-** ( ఈ సూక్ష్మ ఖండికలో శ్రీమద్రామానుజులు (జీవుడు) స్వామి సన్నిధిని ఎప్పుడు చేరుదునో ఎప్పుడు స్వామి నన్నుతన పరిచర్య యందు నియమించుకొని ఆజ్ఞాపించునో అని ఆర్తి వర్ణింపబడినది)

భగవంతుడైనట్టి ఆ శ్రీమన్నారాయణుని నేను ఎప్పుడు చూతునో కదా? ఎప్పుడు స్వామి నాకు ప్రత్యక్షమగునోకదా? (ప్రత్యక్షము అనగా కన్నులకు కనిపించుట) అవి చర్మచక్షువులు కావచ్చు, మానసిక చక్షువులు కావచ్చు) స్వామియే నాకులనాథుడు, నాకులదైవము. నాకులధనము, నాభోగ్యము, నాతల్లి, నాతండ్రి, నాయొక్క సర్వస్వము స్వామియే. అట్టినా స్వామిని ఎప్పుడు దర్శింతునో కదా! భగవత్పాదారవిందద్వయమును ఎప్పుడు నేను నాశిరస్సుపై ధరింతునో కదా! భగవత్పరిచర్యాకరణ యోగ్యుడనై అపరిచర్య మాత్రమే నా భాగ్యముగా తలచు నేను ఎప్పుడు పరిచర్యాపరుడను కాగలనో కదా! ఎప్పుడు భగవానుడు తన అతిశీతలమైన దృష్టితో నన్నుచూచునో కదా! ఆవిధముగా చూచి స్వామి నన్ను తన పరిచర్యలో

ఎప్పుడు నియమించుకొనునో కదా! పరిచర్య చేయుమని ఎప్పుడు ఆజ్ఞాపించునో కదా! ... అని ఇట్లు తలచుచు స్వామి పరిచర్యయందే ఆశను పెంచుకొనుచు, స్వామి అనుగ్రహముచే అను అనుగ్రహింప బడినవాడనై స్వామిని సమీపించి...

**15. మూలము:-** దూరాదేవ భగవంతం శేషభోగే శ్రియాసహాసీనం, వైనతేయాదిభిః సేవ్యమానం "సమస్తపరివారాయ శ్రీమతే నారాయణాయ నమః" ఇతి ప్రణమ్య, ఉత్థాయోత్థాయ పునఃపునఃప్రణమ్య, అత్యంత సాధ్వస వినయావనతో భూత్వా, భగవత్పారిషదగణనాయకైః ద్వారపాలైః కృపయా స్నేహగర్భ భూదృశా అవలోకితః, సమ్యక్ అభినందితైః తైస్తైః ఏవ మనుమతో భగవంతము పేత్య, శ్రీమతామూలమంత్రేణ మామైకాంతిక పరిచర్యా కరణాయ పరిగృహ్ణీష్వేతి యాచమానః ప్రణమ్య, ఆత్మానం భగవతే నివేదయేత్, .....

**అనువాదము:-**(ఈ సూక్ష్మ ఖండికలో జీవుడు స్వామిని సమీపించిన తరువాత చేయు ఆత్మనివేదనము వర్ణింపబడినది)

ఆదిశేషునిపాన్పుపై లక్ష్మీదేవితోకూడి పవళించియున్న భగవానుని దూరమునుండే చూచి, అట్లు పవళించియున్న స్వామి వైనతేయాదులచే సేవింపబడును ఎంతో మనోహరముగా ఉన్నాడని తలచుచు "సమస్త పరివారము శ్రీమతేనారాయణాయనమః''- అని ఉచ్చరించుచు ప్రణామముచేసి, వంగి వంగి మాటిమాటికి నమస్కరించుచు, మిక్కిలి వినయముతో దాటి అవనతుడై ఉండగా, ద్వారపాలకులచేత, భగవానుని పారిషద నాయకులచేత (భగవానుని సభలోని సభ్యులకు నాయకులైన వారిచేత) దయతో, స్నేహపూరితమైన దృక్కులతో చూడబడినవాడై. వారి వారి చేత మంచిగా అభినందించబడినవాడై, వారిచేత కూడ అనుమతించబడినవాడై భగవంతుని సన్నిధికి సమీపించి, శ్రీమంతమైన మూలమంత్రమును (ఓం నమో నారాయణాయ) ఉచ్చరించుచు, "స్వామీ, ఏకాంత పరిచర్య చేయుటకు, తమ కైంకర్యమును సదా చేయుచుండుటకు

అనుమతిని ప్రదానము చేయండి” అని యాచించుచు ప్రణమిల్లి, తనను భగవానునికి నివేదించవలెను. ఇదియే ఆత్మనివేదనము. (అనన్యభావముతో చేయు భగవత్ కైంకర్యాపేక్షతో తనను సమర్పించు నివేదనమే ఆత్మ నివేదనము)

**16. మూలము:–** తతో భగవతా స్వయమేవ ఆత్మ సంజీవనేన మర్యాద శీలవతా అతిప్రేమాన్వితేన అవలోకనేన అవలోక్య, సర్వదేశ సర్వకాల సర్వావస్థోచిత అనంత శేషభావాయ స్వీకృతః అనుజ్ఞాతశ్చ, అత్యంత సాధ్వస వినయా వనతః “కిం కుర్వాణః” ఇతి భగవంతం ఉపాసీతః...

**అనువాదము:–** (ఈ సూక్ష్మ ఖండికలో జీవుడు భగవానుని ద్వారా అనుగృహీతుడగుట వర్ణింపబడినది)

అట్లు ఆత్మనివేదనము చేసిన జీవుని, భగవానుడు స్వయముగా ఆత్మ సంజీవన మర్యాద శీలమైన ప్రేమాన్వితదృక్కులచే చూచి, సర్వదేశ, సర్వకాల, సర్వావస్థలకు తగిన అనంతమై శేషత్వభావమునకు ఆ జీవుని అనుమతించి స్వీకరించును. అనగా నిత్యము శేషభూతుడవై ఉండమని అనుమతించును. అట్లు అనుమతించబడినవాడై, జీవుడు మిక్కిలి తొట్రుపాటుతో, స్వామి అనుమతి లభించినదే అనెడి తత్తరపాటుతో వినయావనతుడై “ఏమిచేయవలెను? ఏమిచేయవలయును? ఏమికైంకర్యము చేయ వలయును?” అని అడుగుచూ, భగవంతుని ప్రశ్నించి తెలుసుకొనుచు ఉపాసించవలెను.

**17 మూలము:–** తతశ్చ అనుభూయమాన భావవిశేషః నిరతిశయప్రీత్యా అన్యత్ కించిత్ కర్తుః ద్రష్టుం, స్మర్తుం అశక్తః, పునరపి శేషభావమేవ యాచ మానో, భగవంతమేవ అవలోకయన్నాసీత;...

**అనువాదము:–** (ఈ సూక్ష్మఖండికలో భగవంతుని సన్నిధిని చేరిన జీవుని యొక్క స్థితి వర్ణింపబడినది.)

తరువాత భగవత్‌సేవా భాగ్యవిషయక భావవిశేషమును అనుభవించుచు జీవుడు నిరతిశయ (మిక్కిలి) ప్రీతికలవాడై, ఇక ఏమియు చేయుటకు, చూచుటకు, స్మరించుటకు కూడ అశక్తుడై అనగా అన్నియు భగవానుని పైననే ఉంచి భగవానునిపైననే దృష్టిని నిలిపి, భగవానునే స్మరించుచు, మరల మరల శేషత్వభావననే యాచించుచు, అనగా నేను తమ దాసుడను. నాకు తమ దాస్యమును చేయు సౌభాగ్యమును కృపచేయుడు అని యాచించుచు, భగవానుని మాత్రమే దర్శించుచు ఉండవలయును.

**18. మూలము:–** తతో భగవతా స్వయమేవ ఆత్మసంజీవనేన అవలోకనేన అవలోక్య, సస్మితమాహూయ, సమస్తక్లేశాపహం, నిరతిశయ సుఖావహం, ఆత్మీయం, శ్రీమచ్చరణారవిందయుగలం. శిరసికృతం ధ్యాత్వా అమృత సాగరాంతర్నిమగ్నసర్వావయవః సుఖమాసీత॥

**అనువాదము:–** (ఈ సూక్ష్మ ఖండికలో భగవచ్చరణారవింద యుగళమును తన శిరస్సుపై స్వామి ధరింపజేసినట్లు భావించి సుఖముగా ఉండుట వర్ణింపబడినది)

తరువాత, అట్లు శేషభావముతో తననే చూచుచున్న ఆ జీవుని ఆత్మోజ్జీవన హేతువైన అవలోకనముచే (చూపుతో) భగవానుడు స్వయముగానే చూచి, చిరునవ్వుతో తనను ఆహ్వానించి, సమస్త క్లేశములను (కష్టములను) పోగొట్టునదియు, నిరతిశయ సుఖములను కలిగించునదియు అయిన తన చరణారవింద యుగళమును స్వామి జీవుడనైన తన శిరస్సుపై ఉంచినాడని ధ్యానముతో దర్శించి, ధ్యానించి, అమృతసాగరములో తన సర్వావయములు అవగాహన మొనర్చుచున్నవని భావించుచు, సుఖముగా ఉండవలయును.

(ఇట్లు జీవునివర్ణించి, ధ్యానించి, మనకుకృపచేసిన శ్రీమద్రామానుజులు ఇదే స్థితిని అనుభవించినారని మనము తలచవలెను).

* * * * *

## ప్రార్థనా నిగమన శ్రుతిః

**శ్లో॥ లక్ష్మీ పతే ర్యతి పతేశ్చ దయైక ధామ్నోః**
**యోఽసౌ పురా సమజనిష్ట జనిష్ట జగద్ధితార్థం,**
**ప్రాప్యం ప్రకాశయతునః పరమం రహస్యం**
**సంవాద ఏష శరణాగతి మంత్రసారః ॥**

ఇది శరణాగతి మంత్రసారము. భగవానుడైన శ్రీమన్నారాయణుని దయతో, యతిపతిమైన శ్రీమద్రామానుజులు జగత్తుల యొక్క హితమును కోరి ఇట్లు ఈ శరణాగతిమంత్రసారమును కృపచేసినారు. శ్రియఃపతి మరియు యతిపతి వీరిద్దరును దయైకధామ్నులే, దయాశీలురే. పరమ రహస్యమైన ఈ శరణాగతి మంత్రసారమును (గద్యత్రయమును) మనమువారికృపచే పొందగలిగినాము, పొందినాము. ఈ శరణాగతి మంత్రసారము భగవానునకు, జీవునకు మధ్య జరిగిన సంభాషణ రూపములో ఉన్నది కదా! ఇది ఎంతో హృదయంగమము – స్పష్టము. ఈ సంభాషణము భగవానునకును, మనకును మధ్య జరిగిన సంభాషణముగనే భావించుట యుక్తము. ఈ పరమ రహస్యమును ప్రతివారు తెలుసుకొనవలయును.

దీనిని అనుసరించి భగవానునకు శరణాగతి చేసి, మనమందరము ఆత్మోజ్జీవితులము అగుదుము గాక.

***ఇతి శ్రీభగవద్రామానుజ విరచితే గద్యత్రయ ప్రబంధే శ్రీవైకుంఠగద్యమ్***

* * * * *